సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 21 । జూన్ । 2025



ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

కుర్చీలు మాకు ముఖ్యం కాదు... ప్రజా సమస్యలు పరిష్కరించడమే తమ ప్రధాన ఎజెండా అని మేయర్ సురేష్ బాబు అన్నారు.

-8లో



ఫిర్యాదు దారులపై పోలీసుల ఆగ్రహం

పోలీసులు ఇష్టానుసారం వ్యవహరించడమే గాక, ఫిర్యాదురాలి కుమారుడు, భర్తపై చేయిం చేసుకోవడంతో మనస్థాపంతో ఆమె ఆత్మహత్యకు యత్నించింది.

-8లో

గరిష్టం/కనిష్టం
38.0/27.5

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.5 - 38.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.32లక్షలు

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడునెలల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.32లక్షలు నగదు, 13 గ్రాముల బంగారం, 280గ్రాములు వెండి ఆభరణాలు వచ్చినట్లు దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పరిపాలనా అధికారి శంకర్‌బాలాజీ, ఎండోమెంట్ అధికారులు, పూర్వపు మఠాధిపతి కుమారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జోనల్ మలేరియా అధికారిగా జమాల్‌బాషా



సాక్షి, పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ సి.జమాల్ బాషాను వైఎస్సార్ కడప జిల్లా జోనల్ మలేరియా అధికారిగా బదిలీ చేశారు. మూడేళ్ల పాటు అక్కడ సేవలందించిన ఆయన జిల్లాలో గిరిజనుల వైద్యానికి ఎంతో శ్రమించారు.

ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులతో ఐటీఐల కన్వీనర్ జ్ఞానకుమార్

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ప్రముఖ కంపెనీలైన ఎల్ అండ్ టి, కోల్గేట్, రానే టెక్నాలజీస్, సిస్‌కోల్, గ్రీన్‌టెక్, షిర్డిసాయి కంపెనీ, టీవీఎస్, అపోలా టైల్స్, చానెల్‌ప్లే, జాన్‌డీర్, ఆటోమోటివ్, అమర్‌రాజా, కియా కంపెనీలు పాల్గొన్నాయని ప్రభుత్వ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. ఈ జాబ్‌మేళాకు జిల్లా వ్యాప్తంగా 312 మంది విద్యార్థులు హాజరుకాగా వివిధ ట్రేడ్స్‌కు సంబంధించి 256 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జ్ఞానకుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని జ్ఞానకుమార్‌తో పాటు పలు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు అభినందించారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వారితో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్

వేంపల్లె: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమార్ స్వామి గుప్తా పేర్కొన్నారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి హర్షిత, పీయూసీ-2 చదువుతున్న కె.శివకుమార్, ఎం.రాఘవేంద్ర, పవర్ లిఫ్టింగ్ కోచ్ బాల గోవిందు తివారీలు 14వ ఏపీ రాష్ట్ర క్లాసిక్, ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం దావనగెరెలో నిర్వహించే జాతీయస్థాయి ఛాంపియన్ షిప్ పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు అధ్యాపకులు బీవీ సుధాకర్ రెడ్డి, డాక్టర్ తిలక్, రాఘవరెడ్డి, అభినందించారు.

వైద్య సేవలు మెరుగు పడాలి



అత్యవసర విభాగంలోని రోగి ఆరోగ్య సమస్యను తెలుసుకుంటున్న జేసీ డాక్టర్ రమేష్‌నాథ్

ప్రొద్దుటూరు క్రైం: జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు ఇంకా మెరుగు పడాల్సిన అవసరం ఉందని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌నాథ్ తెలిపారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలన చేసి ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. వార్డులను తనిఖీ చేసి అక్కడి ఇన్‌పేషెంట్లతో రమేష్‌నాథ్ మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుధ్యం సరిగా లేదని మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఓపీ విభాగాలు అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని సిబ్బంది, వైద్యుల ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. ఆస్పత్రిలోని సమస్యలపై మెడికల్ సూపరింటెండెంట్ శ్రీవాణి, వైద్యులు ఆనంద్‌బాబులతో చర్చించారు. కార్యక్రమంలో వైద్యులు గోపాల్, రూపానంద్, నర్సింగ్ సూరింటెండెంట్ రాణమ్మ, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

షేమ్.. షేమ్..!

- మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ ఉల్లంఘించిన కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి
- మేయర్ విచక్షణతో నిమిత్తం లేకుండా ఎక్స్‌అఫిషియో మెంబర్లకు స్టేజీపైనే కుర్చీలు
- కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు
- అధికార పార్టీ నేతల మెప్పు కోసం హైకోర్టు ఉత్తర్వులు సైతం భేఖాతర్
- తాళం తీయకపోవడంతో బయటే సర్వసభ్య సమావేశం నిర్వహించిన మేయర్

సాక్షి ప్రతినిధి, కడప: కడప మున్సిపల్ కమిషనర్‌కు కార్పొరేషన్ చట్టం పట్ల నిబద్ధత లేదు. పాలకమండలి పట్ల గౌరవం అసలే లేదు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు సైతం ధిక్కరించారు. నవ్విపోదురుగాక... నాకేటి సిగ్గు అన్నట్లుగా అధికార పార్టీ మెప్పు కోసం చట్టం, న్యాయం, ధర్మాన్ని విస్మరించారు. కార్పొరేషన్‌కు మేయర్ సుప్రీం అయినప్పటికీ ఇసుమంతైనా పరిగణలోకి తీసుకోలేదు. తాను ఆదేశించినట్లు మొత్తం పాలకమండలి నడుచుకోవాలంటూ భీష్మించుకున్నారు. సీఎం చంద్రబాబు సర్కార్‌లో నియంతృత్వం రాజ్యమేలుతుండడాన్ని ప్రజాస్వామ్యవాదులు హేళన చేస్తున్నారు.

- మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 88/సీ ప్రకారం 'సమావేశం రోజు, సమయం, ప్రదేశం మేయర్ చేత నిశ్చయించబడుతుంది.'ఆ విషయాన్ని చట్టం స్పష్టంగా వెల్లడిస్తోంది. సర్వ సభ్య సమావేశం కార్పొరేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ కె సురేష్‌బాబు నోటీసు ద్వారా వెల్లడించారు. మరోవైపు కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హోం, రెవెన్యూ శాఖలను ప్రతివాదులుగా చేరుస్తూ ఉత్తర్వులిచ్చింది. శుక్రవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం సందర్భంగా అధికారులు తద్భిన్నంగా వ్యవహరించారు. మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి కార్పొరేషన్ యాక్టు ఉల్లంఘించారు. మేయర్ విచక్షణతో నిమిత్తం లేకుండా ఎక్స్‌అఫిషియో సభ్యులకు మేయర్ స్థాయిలోనే సీట్లు ఏర్పాటు చేశారు. మరోవైపు హైకోర్టు కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేయాలని ఆదేశించినా కాన్ఫరెన్స్ హాల్‌కు తాళం వేశారు. అత్యంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు.



కౌన్సిల్ హాలులో మేయర్‌తో సమానంగా వేసిన కుర్చీలో కూర్చున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి



కమిషనర్ మనోజ్‌రెడ్డి

కుర్చీ పట్ల ఉన్న తాపత్రయం ప్రజాసమస్యలపై ఏదీ...

కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవిరెడ్డి, మేయర్ సురేష్‌బాబు మధ్య శుక్రవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే అధికార దర్పం ప్రదర్శించి మేయర్ స్థాయిలో కమిషనర్ ద్వారా కుర్చీ వేయించుకుంది. పాలకమండలి ఆహ్వానించకముందే నేరుగా వెళ్లి స్టేజీపై ఉన్న కుర్చీలో ఎమ్మెల్యే ఆశీనులయ్యారు. రాష్ట్రంలో వైజాగ్ నుంచి అనంతపురం వరకు ఎక్కడ కూడా కార్పొరేషన్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులకు స్టేజీపైన మేయర్ స్థానం పక్కలో కుర్చీలు లేవు. ఆ నిబంధనలు కడపలో చెల్లుబాటు కావంటూ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అందుకు కడప కార్పొరేషన్ కమిషనర్ వంతపాడారు. ఇదిలా ఉంటే కుర్చీతో నిమిత్తం లేదు, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా మేయర్ సురేష్‌బాబు నడుచుకున్నారు. కాన్ఫరెన్స్ హాల్ వద్ద కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించి కుర్చీ లేకపోయినా ప్రజాసమస్యలపై చర్చించారు, ఎజెండా అమోదించారు. చిత్తశుద్ధి ఉంటే పాలకమండలి చేపట్టిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై సమస్యలు చర్చించేవారని పలువురు వెల్లడిస్తున్నారు. కుర్చీ మేయర్ స్థాయిలో ఉండాలనే తపన ప్రజల సమస్యలను డామినేట్ చేయడంతోనే ఆ దిశగా అడుగులు వేయలేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

తప్పు మీద తప్పు..

కార్పొరేషన్ పాలకమండలి సమావేశం నిర్వహణలో కమిషనర్ మనోజ్‌రెడ్డి తప్పు మీద తప్పు చేశారు. సర్వసభ్య సమావేశం నిర్వహణ నిమిత్తం సమావేశ మందిరం పరిశీలించాలని, వేసిన తాళం తీయాలంటూ మేయర్ కె సురేష్‌బాబు అధికారికంగా ఈనెల 9న కమిషనర్‌ను కోరగా తాళం లేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 19వ తేదీ రాత్రి 7గంటల వరకు వేచి ఉన్నా తాళం తీయలేదు. ఈ నేపథ్యంలో మేయర్‌తోపాటు 38 మంది కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు ఛాంబర్‌లో ఉన్నాం.. కాన్ఫరెన్స్ హాల్ వద్ద కూర్చొని ఉన్నందున అధికారులు రావాలని, సమావేశం కొనసాగించాలని కోరారు. రాత పూర్వకంగా అభ్యర్థించి, కార్పొరేటర్లు అంతా సంతకాలు చేసి కమిషనర్ మనోజ్‌రెడ్డికి లేఖ సమర్పించారు. అయినప్పటికీ ఎలాంటి చలనం లేదు. పైగా మేయర్‌కు అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర ద్వారా కౌన్సిల్ హాల్‌లో ఏర్పాట్లు చేశాం..మీరు అక్కడికి రావాల్సిందిగా జవాబుగా నోటీసు ఇచ్చారు. పాలకమండలికి మేయర్ సుప్రీం అయినప్పటికీ కమిషనర్, అడిషనల్ కమిషనర్ తాము చెప్పినట్లు పాలకమండలి నడుచుకోవాలి అన్నట్లు వ్యవహరించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ, హైకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించిన ధోరణి పట్ల కార్పొరేటర్లు తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. పైగా 39 మంది కార్పొరేటర్లు హాజరై సమావేశం నిర్వహిస్తే, సమావేశానికి హాజరు కానీ కమిషనర్ మీరు సమావేశం నిర్వహించలేదని తిరిగి మేయర్‌కు లేఖ రాయడం గమనార్హం.



అనుచరులతో దండయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే ఆర్. మాధవి



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

కమిషనర్, ఏడీసీ, ఎస్ఈలను సరెండర్ చేస్తూ ఏకగ్రీవ తీర్మానం

నగర పాలక సంస్థ కార్పొరేటర్లుకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, జీహెచ్ఎంసీ యాక్ట్‌కు వ్యతిరేకంగా నడుచుకుంటున్న కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా టేబుల్ అజెండా 25ను చేర్చారు. నిబంధనలకు వ్యతిరేకంగా, పాలకమండలి సభ్యుల మనోభావాలు దెబ్బతీసేలా నడుచుకోవడం, చట్టాన్ని అతి క్రమించడం, సభ్యుల పట్ల ఆశ్రద్ధతో వ్యవహరించడంపై జీహెచ్ఎంసీ యాక్ట్ 104 అనుసరించి మనోజ్‌కుమార్‌రెడ్డి కమిషనర్‌గా విధులు నిర్వర్తించకుండా ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ, విధుల నుంచి తొలగిస్తూ తీర్మానం చేశారు. ఆ తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే టేబుల్ అజెండా 26 ద్వారా అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, టేబుల్ అజెండా 28 ద్వారా మున్సిపల్ ఎస్ఈ చెన్నకేశవరెడ్డిని సైతం ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. చట్టాన్ని అమలు పర్చాల్సిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం వెనుక కేవలం అధికార పార్టీ మెప్పు కోసమేనని స్పష్టం అవుతున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

దేశంలో ఏ మేయర్‌కు ఇంతటి అవమానం జరగలేదు

- కమిషనర్ మనోజ్‌రెడ్డి ఎమ్మెల్యే మాధవి తొత్తు
- కడప మేయర్ కె. సురేష్ బాబు ఆవేదన

కడప కార్పొరేషన్: దేశంలో ఏ కార్పొరేషన్‌లోనూ, ఏ మేయర్‌కు జరగని విధంగా అధికారులు తమను అవమానించారని వైఎస్సార్ జిల్లా కడప నగరపాలక సంస్థ మేయర్ కె. సురేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరపాలక అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ నగర ప్రథమ పౌరుడినైన తనను అవమానించడం దారుణమన్నారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి ఎమ్మెల్యే మాధవికి తొత్తుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. సమావేశం ఎక్కడ నిర్వహించాలన్నది మేయర్ ఇష్టమని, ఆ విచక్షణాధికారం మేయర్‌కు మాత్రమే ఉందని ఉందన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పోలీసు భద్రత మధ్య కాన్ఫరెన్స్ హాలులో సర్వసభ్య సమావేశం నిర్వహించమని స్పష్టంగా చెప్పిందన్నారు. 8 రోజుల ముందు సభ్యులందరికీ ఎజెండా పంపించామని, అందులో కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహిస్తామని చెప్పామే తప్పా ఎక్కడ నిర్వహిస్తామన్నది పేర్కొనలేదన్నారు. కార్పొరేషన్ ప్రాంగణంలో ఎక్కడ నిర్వహిస్తారని కమిషనర్ తనను అడిగిన పాపాన పోలేదన్నారు. ప్రతిసారీ సమావేశం నిర్వహించే కౌన్సిల్ హాలుకు 5 మాసాలుగా తాళాలు వేసి, తాళం చెవులను సెక్రటరీ వద్ద ఉంచకుండా కమిషనర్ తన వద్ద ఉంచుకున్నారన్నారు. ఈనెల 9వ తేదీ కౌన్సిల్ హాలు తెరవాలని తాను స్వయంగా లేఖ ఇచ్చినా కమిషనర్ పెడచెవిన పెట్టారన్నారు. దీంతో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించాలని తాము నిర్ణయించామని, కోర్టు కూడా అదేచోట నిర్వహించాలని చెప్పిందన్నారు. కాన్ఫరెన్స్ హాలులో తాము నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కావాలని, హాలు తాళాలు తీయాలని కోరినా ఏ ఒక్కరూ లెక్క చేయలేదన్నారు. తాను 39 మంది కార్పొరేటర్లు రెండు గంటలపాటు వేచి చూసినా... నగరపాలక సంస్థ తరుపున ఏ ఒక్క అధికారి సమావేశానికి హాజరు కాకపోవడం దౌర్భాగ్యమన్నారు. దీంతో చేసేది లేక తాము హాలు ఎదుట కూర్చొని సమావేశం నిర్వహించుకున్నామన్నారు. కార్పొరేషన్ నిధులతో చేపడుతున్న పనులకు ప్రజల ఓట్లతో గెలుపొందిన కార్పొరేటర్లతో కాకుండా టీడీపీ ఇన్‌చార్జులతో టెంకాయలు కొట్టిస్తున్నారన్నారు. టీడీపీ ఇన్‌చార్జులు ఇచ్చిన లెటర్లు తీసుకొని సచివాలయ ఉద్యోగులను అక్రమంగా బదిలీలు చేస్తున్నారన్నారు. తాము ఇంకా ఎన్ని అవమానాలు పడాలో అర్థం కావడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. అటు రాష్ట్రంలో...ఇటు కార్పొరేషన్‌లో రెడ్ బుక్ పాలన సాగుతోందని కమిషనర్ నియంతృత్వ పోకడలకు ఇది ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. దాడులు, గూండాయిజం, దౌర్జన్యాలు, మానభంగాల్లో బీహార్, ఒడిశా రాష్ట్రాలను మించిపోయేలా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కమిషనర్, అడిషనల్ కమిషనర్‌లపై చర్యలు తీసుకునేలా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

పండుగ వాతావరణంలో యోగా దినోత్సవం

కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని శనివారం పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా దినోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఉదయం 7 గంటలకు జిల్లాలో 5లక్షల మందికి పైబడి యోగా దినోత్సవంలో పాల్గొనబోతున్నారని వెల్లడించారు. గ్రామాలు, మున్సిపల్ వార్డులు, స్కూళ్లు, కాలేజీలు, కమ్యునిటీ సెంటర్లు, గ్రామ పంచాయితీ కార్యాలయాలు ఇలా 5700 లోకేషన్లను ట్యాగ్ చేశామన్నారు. కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో 7వేల మందితో, ఇండోర్ స్టేడియం, సెవెన్ రోడ్స్, రాజీవ్ మార్గ్ తదితర 500 పైబడి ప్రాంతాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రొద్దుటూరులో 5వేలమంది, బద్వేల్ 5వేలు, పులివెందుల్లో 5వేల మందితోపాటు ఇతర పట్టణాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో వెయ్యి నుంచి 1500 మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమ వేదికల వద్ద తాగునీరు, రాగి జావ, వైద్య సదుపాయాలు వంటి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గత నెల రోజులుగా శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా వాసులు ఆరు అవార్డులు గెలుచుకున్నారని తెలిపారు. వీరికి విశాఖపట్నంలో శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తారన్నారు సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

'యువత పోరు'ను విజయవంతం చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈనెల 23వ తేదీ నిర్వహించే 'యువత పోరు'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షేక్ షఫీవుల్లా అధ్వర్యంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాతో కలిసి యువజన, విద్యార్థి, వలంటీర్ల విభాగాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఏ హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. విద్యార్థులు, యువజనులను ఈ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగ యువతకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. తల్లికి వందనం పేరు మీద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పారని, కానీ సగానికిపైగా తల్లులకు తల్లికి వందనం అందలేదన్నారు. ఈ ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేయకపోయినా ఏడాదిలోనే రూ.1.58లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఉద్యోగులు, పింఛనర్లకు కూడా డీఏలు, పీఆర్‌సీ ఇవ్వలేదని తెలిపారు. అనంతరం 'యువత పోరు'కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి, నగర అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'యువత పోరు'పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

డిష్యూం...డిష్యూం..!

- ముష్టి ఘాతాలకు దిగిన తెలుగుతమ్ముళ్లు
- అక్రమ సంపాదనలో తేడాలు
- కడప ఎమ్మెల్యే ఇంట్లోనే పరస్పర దాడి
- సర్దిచెప్పిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: అక్రమ సంపాదన వారి మధ్య వైరం పెంచింది. అధికారం అడ్డుగా పెట్టుకొని చేస్తున్న అక్రమ వ్యవహారాలు బెడిసికొట్టాయి. గత ప్రభుత్వ కాలంలో విపక్షంగా పోరాటం చేశాం, ఇప్పుడు స్వపక్షంలో ఉంటూ పోరాటం చేయాల్సి వస్తోందని మాటామాటా పెరిగింది. అంతే ఒక్కమారుగా ముష్టి ఘాతాలు పడ్డాయి. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి సాక్షిగా వారి సొంతత ఇంట్లో తెలుగుతమ్ముళ్లు పరస్పర దాడులు చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

కడప నగర కార్పొరేషన్‌లో 50డివిజన్లుకు 49 డివిజన్లు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఒకే ఒక్క డివిజన్‌తో తెలుగుదేశం పార్టీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాగా జనరల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోల్పోయింది. తర్వాత చోటుచేసుకున్న పరిణామాల్లో 8మంది వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిలో 8వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీదేవి అమె భర్త అండ్లూరు బాలకృష్ణారెడ్డి ఉన్నారు. అధికారం అడ్డుపెట్టుకొని సొమ్ము చేసుకోవాలనే తపనే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకునేలా చేసిందని విశ్లేషకుల అంచనా. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరే వరకు టీడీపీ కోసం పనిచేసిన వారికి ఎమ్మెల్యే మాధవిరెడ్డి వద్ద మంచి ప్రాధాన్యత లభించేది. ఎప్పుడైతే 8మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరారో, అప్పటి నుంచి తెలుగు దేశం పార్టీ కోసం ఎన్నికల్లో కష్టపడ్డ వారికి ప్రాధాన్యత క్రమేపీ తగ్గింది. ఈ క్రమంలో పాత, కొత్త తెలుగుతమ్ముళ్ల మధ్య తేడాలు వచ్చాయి. అక్రమ సంపాదనలో పోటీ పెరిగింది. ఒకరి ప్రయత్నంలో మరొకరి జోక్యం ఎక్కువైంది. ఆ క్రమంలో ఎప్పటి నుంచో ఉన్న ఆగ్రహావేశాలు ఒక్కమారుగా బహిర్గతమయ్యాయి. పాతకడప మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన అండ్లూరు బాలకృష్ణారెడ్డి ఒకరికొకరు నా వ్యవహారంలో నీ జోక్యం అనవసరమంటూ మాటలు పెట్టుకున్నారు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. ఆపై ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఇంట్లోనే పరస్పర ముష్టిఘాతాలకు పాల్పడ్డారు. వారిలో ఒకరికి గోడకు తగులుకొని స్వల్ప గాయమైనట్లు సమాచారం. పక్క రూములో ఉన్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇరువురికి సర్దిచెప్పాల్సి వచ్చింది. ఈమొత్తం వ్యవహారం అక్రమ కార్యకలాపాల నేపథ్యంలో చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.



క్లుప్తంగా

విట్‌లో విద్యార్థికి ఉచిత ప్రవేశం


సాయికీర్తన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

నందలూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పి.సాయికీర్తన్‌కు అమరావతి విట్‌లో ఉచితంగా ప్రవేశం లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. మాట్లాడుతూ సాయికీర్తన్ ఎంపీసీ గ్రూపులో 957 మార్కులు సాధించి ప్రతిభ చూపారని, స్టార్ అవార్డు సాధించిన అతడికి ఉచిత సీటు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.

తప్పిన పెను ప్రమాదం


మల్లేల ఘాట్‌లో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

తొండూరు : మండలంలోని మల్లేల ఘాట్‌లో సింహాద్రిపురం నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. మల్లేల ఘాట్ వద్ద మలుపులో వెళ్తున్న బస్సు శుక్రవారం అదుపు తప్పి లోయలోకి జారింది. పెద్ద రాయిని ఢీకొని ఆగిపోవడంతో 30మంది ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష


ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

వల్లూరు(చెన్నూరు) : మద్యం సేవించి లారీ నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష, రూ 2,500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎమ్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పినట్లు చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. మండలంలో గురువారం పోలీసులు బ్రీత్ అనలైజర్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. వేల్పూర్ల రామకృష్ణ మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా నేరం రుజువు కావడంతో కడప ఫస్ట్ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మేజిస్ట్రేట్ మంగళ గౌరీ జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చులో పడి రైతుకు గాయాలు

మదనపల్లె రూరల్ : అటవీ జంతువుల కోసం వేటగాళ్లు పన్నిన కరెంట్ ఉచ్చులో పడి ఓ రైతు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. దిగువపల్లెకు చెందిన పెద్దిరెడ్డి కుమారుడు రైతు శ్రీనివాసులురెడ్డి(58) గురువారం రాత్రి తన పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి వేళ గమనించకుండా పొలానికి సమీపంలో వేటగాళ్లు వన్యప్రాణుల కోసం ఏర్పాటుచేసిన కరెంట్ ఉచ్చులో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

- కుర్చీలు ముఖ్యం కాదని చాటిన మేయర్, కార్పొరేటర్లు
- కాన్ఫరెన్స్ హాలు ఎదుటే సర్వసభ్య సమావేశం నిర్వహణ
- అధికారుల గైర్హాజరు.. పలు తీర్మానాలకు ఆమోదం


కాన్ఫరెన్స్ హాలు ఎదుట సమావేశం నిర్వహిస్తున్న మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పాల్గొన్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు...తాగునీరు, పారిశుధ్యం, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ఇలా ఎన్నో సమస్యలు ఉన్నాయి...కుర్చీలు మాకు ముఖ్యం కాదు...ఎక్కడ కూర్చున్నా ప్రజా సమస్యలు పరిష్కరించడమే తమ ప్రధాన ఎజెండా అని మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చాటి చెప్పారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించే కాన్ఫరెన్స్ హాలు ఎదుట నగరపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు.

అంతకుముందు ప్రతిసారీ సర్వసభ్య సమావేశం నిర్వహించే కౌన్సిల్ హాలులో సమావేశం నిర్వహించేందుకు నగరపాలక అధికారులు గురువారం రాత్రి 11 గంటలకు కౌన్సిల్ హాలు తెరిచి ఏర్పాట్లు చేశారు. అందరూ అనుకున్నట్లే కౌన్సిల్ హాలులో వేదికపై మేయర్ కుర్చీతోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులకు కూడా కుర్చీలు వేశారు. ఈ ఫొటోలు శుక్రవారం ఉదయమే వైరల్‌గా మారాయి. దీంతో మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ హాలులోకి వెళ్లకుండా మేయర్ ఛాంబర్‌లోనే కూర్చొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించదలిచాం...అధికారులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ మనోజ్‌రెడ్డికి సందేశం పంపారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, 12 గంటల వరకు కోర్టు కేసులో కాన్ఫరెన్స్‌లో ఉన్నానని చెప్పిన కమిషనర్...ఆ తర్వాత మేయర్‌తో చర్చించకుండా నేరుగా కౌన్సిల్ హాలుకు పోయి ప్రభుత్వ విప్ ఆర్. మాధవితో మంతనాలు సాగించారు. మేయర్‌ను పిలుచుకొని రావాలని అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, కార్పొరేషన్ సెక్రటరీ రాజశేఖర్‌లకు చెప్పడంతో వారు వచ్చి సమావేశానికి రావాలని మేయర్‌ను కోరారు. దీనిపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ... నేను మేయర్‌నా లేక అటెండర్‌నా...కమిషనర్ చెప్పినట్లు నేను వినాలా...లేక తాను చెప్పినట్లు కమిషనర్ వినాలా... అని వారిని ప్రశ్నించారు. సమావేశం ఎక్కడ నిర్వహిద్దామని కమిషనర్ నాతో ఎందుకు చర్చించలేదు...కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించాలని కోర్టు చెప్పింది, సభ నిర్వహణకు తామంతా సిద్ధంగా ఉన్నాం...అధికారుల కోసం రెండు గంటలుగా వేచి చూస్తున్నామని మేయర్ వారితో అన్నారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మొత్తం మీద అధికార పార్టీ నేతలు అండగా ఉంటారన్న అహంకారం...ప్రతిపక్షంలో ఉన్నారు కదా వీళ్లతో ఏమవుతుందన్న చిన్నచూపుతో నగరపాలక అధికారులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా ఎజెండా మాది..

అనంతరం మేయర్, కార్పొరేటర్లు కాన్ఫరెన్స్ హాలు ఎదుట కుర్చీలు వేసుకొని సమావేశమయ్యారు.1వ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య ఎజెండా చదివి వినిపించగా ఒక్కో అంశాన్ని ఆమోదిస్తున్నట్లు సభ్యులు చేతులెత్తారు. నగరపాలక పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 100 మంది విద్యావలంటీర్ల నియామకం చేపట్టేందుకు తీర్మానం చేశారు. రవీంద్రనగర్ 43/2లో విధులు నిర్వహిస్తున్న వార్డు ఎమినిటీస్ సెక్రటరీ కిరణ్మయిని తిరుపతి కార్పొరేషన్‌కు, బద్వేల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్ ఎం నాగకుమార్‌ను కడపకు బదిలీ చేయడానికి, దేవునికడప 2/1 సచివాలయంలో పనిచేస్తున్న వార్డు ఎమినిటీస్ సెక్రటరీ నీలిమను తిరుపతి కార్పొరేషన్‌కు బదిలీ చేయడానికి అనుమతించారు. కార్పొరేషన్‌లో జరిగే పనులను తనిఖీ చేసి క్వాలిటీ సర్టిఫికెట్ జారీ చేసే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీ కాలపరిమితిని ఆరునెలలు పొడిగించారు. 44వ డివిజన్‌లో ఇక్బాల్ రైస్‌మిల్ నుంచి ఐటీఐ సర్కిల్, కాగితాల పెంట మీదుగా బుగ్గవంకలో కలిసేలా వరదనీటి కాలువ రూ.1.65కోట్లతో నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేశారు. వీధి కుక్కల బర్త్ కంట్రోల్ చేసే సంతులన్ జీవన్ కళ్యాణ్ కాలపరిమితిని పొడిగించకుండా ఎంహెచ్‌ఓపై విచారణ చేయాలని తీర్మానించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు జనరల్ ఫండ్ నుంచి చెల్లింపులు చేసేలా తీర్మానం ఆమోదించారు.

కమిషనర్, ఏడీసీ, ఎస్‌ఈలను సరెండర్ చేయాలని సిఫారసు

సర్వసభ్య సమావేశాల్లో మెజార్టీ సభ్యులమైన తాము చేసిన తీర్మాణాలు, స్టాండింగ్ కమిటీ తీర్మాణాలు అమలు పరచకుండా సొంత ఎజెండా అమలు చేస్తూ, మేయర్, కార్పొరేటర్లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, సీహెచ్ఎంసీ యాక్టుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, సూపరింటెండెంట్ ఇంజినీర్ చెన్నకేశవరెడ్డిలను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు పాకా సురేష్, మగ్బూల్ బాషా, రామలక్ష్మణ్‌రెడ్డి,బాలస్వామిరెడ్డి, చంద్రహాసరెడ్డి, శివకోటిరెడ్డి, కె. బాబు, ఎంపీ శ్రీదేవి, బండి జయమ్మ, హేమలత, శ్రీలేఖ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

'కుర్చీ'దక్కినా ప్రయోజనం శూన్యం

కాగా మేయర్‌తో సమానంగా వేదికపై తనకు కుర్చీ వేయలేదని గత రెండు సమావేశాల్లో నానా యాగీ చేసిన ప్రభుత్వ విప్ ఆర్. మాధవి ఎట్టకేలకు తన పంతం నెగ్గించుకున్నారు. నిబంధనలకు విరుద్ధమైనా సరే....కమిషనర్ ద్వారా కౌన్సిల్ హాలులో వేదికపై కుర్చీ వేయించుకున్నారు. శుక్రవారం సర్వసభ్య సమావేశం సందర్భంగా హాలులోకి రాగానే ఆ ఆసనంపై ఆశీనులై ఆనందించారు. అయితే టీడీపీలోకి పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు మినహా మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ హాలులో సమావేశానికి రాకపోవడంతో కుర్చీ దక్కిన ఆనందం ఎంతోసేపు నిలవలేదు.

■ నగరపాలక సర్వసభ్య సమావేశం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి పటిష్ట భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో కడప డీఎస్పీ, మరో డీఎస్పీ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. కోటిరెడ్డి సర్కిల్- సంధ్యా సర్కిల్ వరకూ వాహనాల రాకపోకలను నియంత్రించారు.కొందరు టీడీపీ కార్యకర్తలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని పంపించేశారు.

సమావేశం ఎక్కడ నిర్వహించాలనేది మేయర్ అభీష్టం: ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

నగరపాలక సర్వసభ్య సమావేశం ఎక్కడ నిర్వహించాలన్నది మేయర్ అభీష్టమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి అన్నారు. కొన్ని మాసాలుగా కౌన్సిల్ హాలుకు తాళాలు ఎందుకు వేసి ఉన్నారో అధికారులు చెప్పాలన్నారు. మేయర్ ఆదేశాలను కమిషనర్ పాటించకపోవడం అప్రజాస్వామికమన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఎక్కడ మీటింగ్ పెట్టినా అధికారులు హాజరుకావాలని తెలిపారు.

సమావేశం ఉందని చెబితే వచ్చా ఎమ్మెల్యే మాధవిరెడ్డి

నగరపాలక సర్వసభ్య సమావేశం ఉందని చెబితే ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా హాజరయ్యానని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి అన్నారు. సమావేశం నిర్వహించాల్సిన మేయర్ మీటింగ్‌కు రాలేదని, అందువల్ల మీటింగ్ జరగలేదన్నారు. కాన్ఫరెన్స్ హాలు ఎదుట సమావేశం నిర్వహించారు కదా... అని విలేకరులు ప్రశ్నించగా అది అధికారులే తేలుస్తారని సమాధానమిచ్చారు.

మేయర్‌కు నోటీసులంటూ హంగామా వివరణ ఇచ్చామని మాట మార్చిన వైనం

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తాం... అధికారులు హాజరుకావాలని కోరితే పట్టించుకోని కమిషనర్ మనోజ్‌రెడ్డి ...తీరా సర్వసభ్య సమావేశం పూర్తయ్యాక మేయర్‌కు నోటీసు ఇస్తున్నట్లు మీడియాకు లీకులిచ్చారు. అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర, సెక్రటరీ రాజశేఖర్ ఆ పేపర్లు తీసుకొచ్చి మేయర్ తీసుకోనందున ఆయన ఛాంబర్‌కు అంటించారు. అయితే మేయర్‌కు నోటీసులిచ్చే అధికారం మీకుందా ..అని మీడియా ఏడీసీని ప్రశ్నించడంతో ఖంగుతిన్న ఏడీసీ కొద్దిసేపటికి సర్దుకొని అవి నోటీసులు కావు...వివరణ మాత్రమేనని మాటమార్చారు. అందులో ఏముందంటే 13వ తేదీ ఇచ్చిన ఎజెండాలో వేదిక ఎక్కడనేది పేర్కొనలేదని, కావున తాము సర్వసాధారణంగా కౌన్సిల్ హాలులో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి అధికారులు సిద్ధంగా ఉన్నారని, సాయంత్రం 5 గంటల వరకూ ఇక్కడే ఉంటారని, ఆ లోపు మేయర్ హాజరు కాకపోయినా, కోరం లేకపోయినా సమావేశం వాయిదా పడినట్లు ప్రకటిస్తామని అందులో తెలిపారు. సమావేశ నిర్వహణపై కమిషనర్ మేయర్‌తో మాట మాత్రమైన చర్చించకుండా అహంకారపూరిత ధోరణిలో వ్యవహరిస్తూ ఇలా మేయర్ ఛాంబర్‌కే నోటీసులు అంటించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ట్రాఫిక్ ఆంక్షలపై విస్తుపోయిన జనం

కడప అర్బన్ : కడప నగరంలోని కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ప్రారంభానికి ముందు నుంచే కడప పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. కడప డీఎస్పీతోపాటు, మరో డీఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు, త్రినేత్ర, వజ్ర వాహనాల నిఘాతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా విధులు నిర్వహించారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి సంధ్యా సర్కిల్ వరకు బారికేడ్లను ఏర్పాటు చేసి ఎలాంటి వాహనాలు వెళ్లనీయకుండా కట్టడి చేశారు. నగరంలో నుంచి రాయచోటి వైపు వెళ్లాల్సిన వాహనాలన్నీ ఇటు నుంచే వెళ్లాల్సి వుంది. కర్నూలు, విజయవాడ, నంద్యాల, మదనపల్లి, రాయచోటి వైపు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులన్నీ ఈ దారిలోనే వెళ్లాల్సి వుంది. ఉదయం సాయంత్రం పాఠశాలలకు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారు, వచ్చే వారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా జెడ్పీ వంతెన, రైల్వేస్టేషన్ వైపు, ఇటు కోటిరెడ్డి సర్కిల్ నుంచి పాతబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్‌లకు వెళ్లేటపుడు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవిష్యత్తులో జరుగబోయే సమీక్ష సమయంలోనైనా వాహనదారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడకుండా కాస్త వెసులుబాటును కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. మరోవైపు టీడీపీ యువత తమ వంతుగా నిరసనలను తెలియజేయాలని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఇరిగేషన్ కార్యాలయం వరకు గుంపుగా వచ్చారు. కాసేపు నినాదాల తరువాత వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు.


కౌన్సిల్ హాలులో ఎమ్మెల్యే మాధవితో పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు


మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ బందోబస్తు


నిర్మానుష్యంగా ఉన్న కార్పొరేషన్ రోడ్డు


మేయర్ ఛాంబర్‌కు నోటీసులు అందిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, సెక్రటరీ రాజశేఖర్

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం

డీఆర్వో విశ్వేశ్వరనాయుడు


రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రెవెన్యూ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్వో మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలనకు థామస్ మన్రో చేసిన కృషికి గౌరవ సూచికంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో పురాతన సమకాలీన రెవెన్యూ రికార్డుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కమలాపురం మండలంలో వీఆర్వోగా పనిచేస్తూ మరణించిన ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు, వల్లూరు మండలంలో వీఆర్వోగా పనిచేస్తూ మరణించిన రామ్మోహన్ కుటుంబ సభ్యులకు డీఆర్వో ఆర్థికసాయం అందించారు. కడప డివిజన్‌లోని తహసీల్దార్లు తమ సిబ్బందితో కలిసి పాల్గొని ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు రంగస్వామి, కిరణ్‌కుమార్, నీలమయ్య, నిత్యానందరాజు, జీవన్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్ని మండల తహసీల్దార్లకు కంప్యూటర్లను పంపిణీ చేశారు. చివరగా రెవెన్యూ శాఖకు సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కమలాపురం : పట్టణంలోని తెలుగు వీధికి చెందిన హరీష్ కుమార్ (26) రైలు కింద పడి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన హరీష్ కుమార్ శుక్రవారం రాత్రి కమలాపురం పట్టణ శివారులోని చెరువు కట్ట వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. శరీరం రెండు ముక్కలైంది. ట్రాక్ మాన్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టమ్ నిమిత్తం రిమ్స్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కువైట్ వెళ్లిన హరీష్ మూడు మాసాల క్రితం కమలాపురం వచ్చాడని, మృతి గల కారణాలు తెలియరావాల్సి ఉందని వారు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని పలు వాహనాలను చోరీ చేసిన నిందితుడిని సీఐ హేమసుందర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం అరెస్టు చేశారు. అతడి నుంచి ట్రాక్టర్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ నిందితుడు గతంలో పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని, అనంతపురం జిల్లాలో 12 కేసులు అతడిపై నమోదైనట్లు తెలిపారు.

ఏపీజీబీ కార్యాలయంపై సోలార్ యూనిట్


రూఫ్ టాప్ సోలార్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఏపీజీబీ హెడ్ ఆఫీస్ అనెక్స్ భవనంపై 100 కిలోవాట్ల ఆన్‌గ్రిడ్ రూఫ్ టాప్ సోలార్ యూనిట్లను ప్రారంభించామని ఆ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సోలార్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కార్యక్రమం కింద రూ.52 లక్షల ఖర్చులతో 100 కిలోవాట్ల ఆన్ గ్రిడ్ రూఫ్ టాప్ సోలార్ యూనిట్ ప్రారంభించామన్నారు. అలాగే అనంతపురం ప్రాంతీయ కార్యాలయంలో రూ.14 లక్షలతో 25 కిలోవాట్ల ఆన్ గ్రిడ్ స్టిమ్, 29 బ్రాంచ్‌లలో 89 కిలో వాట్ల సామర్థ్యం గల ఆఫ్ గ్రిడ్ సిస్టమ్‌లను ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ అరుణకుమార్, జీఎంలు హరికేశ్వర్ ప్రసాద్, పవన్‌కుమార్ సింగ్, కడప ప్రాంతీయ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బీరు బాటిళ్లతో యువకుల హల్‌చల్

మదనపల్లె రూరల్: పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లే అవుట్‌లోని వివేకానంద స్కూల్ సమీపంలో కొందరు యువకులు బీరు బాటిళ్లు పట్టుకుని శుక్రవారం హల్‌చల్ చేశారు. పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డుపై గొడవపడుతూ వీరంగం సృష్టించారు. అదే మార్గంలో పాదచారులు, విద్యార్థులు వెళుతున్నా లెక్కపెట్టకుండా ఒకరిపై ఒకరు పిడి గుద్దులు గుద్దుకుంటూ అరుపులు, కేకలతో భయం కలిగించేలా వ్యవహరించారు. చేతిలో బీరు బాటిల్‌తో పరిగెత్తుతూ, స్థానికులను భయాందోళనకు గురిచేశారు. ఈ ఘటనను కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆకతాయిలు...మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్‌కు బారికేడ్ల వితరణ


బారికేడ్లను అందిస్తున్న భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధులు

బ్రహ్మంగారిమఠం : స్థానిక పోలీస్ స్టేషన్‌కు భారతి సిమెంట్ కంపెనీ పది బారికేడ్లను వితరణ చేసినట్లు ఏఎస్ఐ గురప్ప తెలిపారు. భారతి సిమెంటు కంపెనీ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బి.మఠం భారతి సిమెంటు డీలర్లు పోలు అంకిరెడ్డి, భూమిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బారికేడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా భారతి సిమెంటు కంపెనీ తరపున ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, భారతి సిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం


గుర్తు తెలియని శవం

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె సమీపంలోని శ్రీరాములకుంట సమీపంలో రైతు నాగేశ్వరరావు పొలం పక్కన గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. శుక్రవారం మేకల కాపరులు శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శవం గుర్తు తెలియని విధంగా ఉందని, నస్యం కలర్ బెల్ట్, కాఫీ కలర్ పాయింట్, మెడలో నల్లటి పూసల దండ, శ్యాంసంగ్ మొబైల్, నల్లటి వాచ్, మెడలో ఆరంజ్ కలర్ కాశీ దండ, కుడి చేతికి స్టీల్ బ్రేస్ లైట్ ఉన్నట్లు ఎస్ఐ వివరించారు. ఎవరైనా గుర్తుపడితే 9121100632 ఫోన్‌కు నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌పై నుంచి జారిపడి వృద్ధురాలి మృతి

మదనపల్లె రూరల్ : బైక్‌పై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. జంగాలపల్లెకు చెందిన రాజమ్మ(80)కు అనారోగ్యంగా ఉండడంతో డాక్టర్ వద్దకు వెళ్లేందుకు బంధువు శ్రీరాములు ద్విచక్ర వాహనంలో చౌడేపల్లెకు బయలుదేరింది. చికిత్స అనంతరం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలో కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పింది. బైక్‌పై కూర్చొన్న రాజమ్మ ప్రమాదవశాత్తూ జారి కిందపడింది. తలకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఫిర్యాదుదారులపై పోలీసుల ఆగ్రహం

- అన్యాయం జరిగిందని స్టేషన్‌కు వెళ్తే కేసు తీసుకోలేదు
- బాధితురాలి కళ్ల ముందే కుమారుడు, భర్తపై చేయి చేసుకున్న సీఐ
- మనస్తాపంతో బాధితురాలు ఆత్మహత్యాయత్నం


రైలు పట్టాలపై పడుకున్న లక్షుమ్మ, కుమారుడు మహీధర్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుకన్య

ప్రొద్దుటూరు క్రైం : ప్రజల ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో పరిష్కరించాల్సిన పోలీసులే ఇష్టానుసారం వ్యవహరించడమేగాక, ఫిర్యాదురాలి కుమారుడు, భర్తపై చేయిం చేసుకోవడంతో మనస్థాపంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. బాధితుల వివరాల మేరకు... స్థానిక ఈశ్వరరెడ్డి నగర్‌కు చెందిన సుకన్య పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తోంది. అక్కడ పనిచేసే ఏసోబుతో డబ్బు విషయమై గొడవ జరిగింది. సుకన్యకు చదవడం, రాయడం రాకపోవడంతో ఆమె అక్క లక్ష్మమ్మ, ఆమె భర్త విజయ్‌బాబు, కుమారుడు మహీధర్‌ను తీసుకుని ఫిర్యాదు చేసేందుకు శుక్రవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు పత్రం ఇవ్వగా తీసుకోలేదు. దీంతో మనస్థాపం చెందిన సుకన్య స్టేషన్ ఆవరణలోనే వాస్మాల్ ద్రావణం తాగింది. ఈ దృశ్యాలు మహీధర్ ఫోన్‌లో చిత్రీకరించడంతో సీఐ రామకృష్ణారెడ్డి అతడిపై చేయి చేసుకున్నాడు. బాలుడు ఏడ్వడంతో సీఐ వద్దకు వెళ్లి 'బాబు తెలియక వీడియో తీశాడు తప్పెప్పోయింది వదిలేయండి' అని చెప్పిన బాలుడి తండ్రి విజయ్‌బాబుపై సీఐ చేయి చేసుకున్నట్లు లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. తమ రెండు ఫోన్లను పోలీసులు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే తన కళ్ల ముందే కుమారుడు, భర్తను కొట్టడంతో లక్ష్మమ్మ మనస్థాపం చెంది రైల్వే పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు వారిని కాపడారు. అయితే ఈ దృశ్యం కొందరు సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో ఇంటి వద్ద ఉన్న లక్ష్మమ్మ కుమార్తెలు చూశారు. అయితే డబ్బు విషయమై జరిగిన గొడవలో పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. విజయ్‌బాబు ఫిర్యాదు మేరకు ఏసోబు, ఆయన భార్య రాజమ్మ, కుమార్తె గీతికలపై కేసు నమోదు కాగా ఏసోబు ఫిర్యాదు మేరకు విజయ్‌బాబు, భార్య లక్షుమ్మ, అన్న కొడుకుపై కేసు నమోదు చేశామన్నారు.


తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో ఆవేదన చెందుతున్న వారి నలుగురు కుమార్తెలు

ఆందోళనతో అడిగితే హేళన చేశారు

సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలతో ఆందోళనగా పోలీస్ స్టేషన్‌కు వచ్చాం. తమ తల్లిదండ్రులు రైలు పట్టాలపై పడుకున్నట్లు వీడియో వచ్చిందని ఆరా తీయగా.. వారు హేళనగా మాట్లాడి పంపారు. కంప్లెంట్ తీసుకోం.. మీరే వెళ్లి వెతుక్కోపోండి పోలీసులు అన్నారు.

\- లక్ష్మమ్మ కుమార్తెలు శ్వేత, స్వాతీ, హారిక

నేను దూషించలేదు

సుకన్య వాస్మాల్ తాగిన తర్వాత హాస్పిటల్‌కు తీసుకెళ్ల కుండా వీడియో తీస్తుంటే మహిధర్‌ను కొట్టినట్లు చెప్పారు. సుకన్య ఫిర్యాదును తీసుకోమని చెప్పలేదని, లక్షుమ్మను దూషించలేదని, పోలీసులను భయపెట్టేందుకు ఆమె రైలు పట్టాలపై పడుకుందని సీఐ వివరణ ఇచ్చారు.

\- రామకృష్ణారెడ్డి, సీఐ